ఉచితంగా వైద్య పరీక్షలు

గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ సేవాభవన్‌లో ఆదివారం ఉచిత మధుమేహ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రోగులకు గుడివాడకు చెందిన వైద్యురాలు గవిర్నేని రజనీ ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. దాతలు నర్రా గంగాధరరావు(వెస్టిండీస్), కొసరాజు బాపయ్యచౌదరి, వల్లభనేని రామకృష్ణ ఆర్థికసాయంతో నిర్వహించిన ఈ శిబిరంలో 165మందికి పరీక్షలు జరిగాయని లయన్స్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ తెలిపారు.

రజక చెరువు ప్రాంతాన్ని పట్టణంలో కలపాలి

గుడివాడ టౌన్: స్థానిక దనియాల పేట సమీపంలో ఉన్న రజక చెరువు ప్రాంతం పురపాలక సంఘం పరిధిలో కలపాలని భవిష్యత్ భద్రతాదళం సభ్యులు డిమాండ్ చేశారు. ఆదివారం దళం సభ్యులు స్థానికుల నుంచి సంతకాల సేకరణ ప్రారంభించారు. భద్రతాదళం వ్యవస్థాపకుడు వైవీ మురళీకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం దీనిపై చర్యలు తీసుకోకపోతే పోరాటానికి దిగుతామని పేర్కొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యం

గుడ్లవల్లేరు: శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యమని గుడ్లవల్లేరు ఎస్ఐ ఎన్.వి.వి. సత్యనారాయణ అన్నారు. మండలంలోని రౌడీ షీటర్లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు.

సీఐకి సత్కారం



సీసీఎస్ సీఐ రమణమ్మను సత్కరిస్తున్న కలెక్టర్, ఎస్పీ

గుడివాడరూరల్: మహిళా దినోత్సవం సందర్భంగా గుడివాడ క్రైమ్ పోలీస్ స్టేషన్ సీఐ(సీసీఎస్) ఇంజరపు రమణమ్మను మచిలీపట్నంలో శనివారం రాత్రి జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ ఆర్.గంగాధరరావు సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధుల నిర్వహణలో రమణమ్మ ప్రజలకు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. కాగా ఆదివారం సీఐ రమణమ్మను స్టేషన్ సిబ్బంది సత్కరించారు.

పీ-4 సర్వే ప్రారంభం



దేవరపల్లిలో సర్వే చేస్తున్న సచివాలయ ఉద్యోగి

తోట్లవల్లూరు: మండలంలో పీ-4 సర్వేను ప్రారంభించినట్లు ఎంపీడీఓ కేఎస్ రవికాంత్ తెలిపారు. ప్రభుత్వం, దాతలు, ప్రజల భాగస్వామ్యంతో ప్రతి ఇంటికీ అభివృద్ధి, ప్రతి జీవితానికి ప్రగతి లక్ష్యంతో సర్వే జరుగుతోందన్నారు. పీ-4 సర్వేలో గ్రామ సచివాలయ ఉద్యోగులు, ఏఎన్ఎంలు, వీఆర్ఓలు, గ్రామ సర్వేయర్లు పాల్గొంటున్నట్లు తెలిపారు. సర్వేకు ప్రజలు తమ వంతు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన



గుడివాడరూరల్: గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపై ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలని మండల ప్రత్యేకాధికారి పీబీ సాల్మన్‌రాజు పేర్కొన్నారు. మండలంలోని బొమ్ములూరులో ఆదివారం చెత్త సేకరణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. తొలుత గ్రామస్తులకు తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చెత్త సేకరణ చేసే సిబ్బంది ప్రతిరోజూ గ్రామస్తులకు తడి, పొడి చెత్తను విడిగా అందజేసే విధంగా సూచనలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విష్ణుప్రసాద్, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి కె.రామ్మోహనరావు పాల్గొన్నారు.

మహిళలు చైతన్య వంతులు కావాలి



మహిళను సన్మానిస్తున్న శామ్యూల్ తదితరులు

పామర్రు: సమాజంలోని మహిళలు మరింత చైతన్య వంతులు కావాలని బిషప్ కొడాలి శామ్యూల్ పేర్కొన్నారు. స్థానిక చాట్ల వానిపురంలోని విజన్ లైఫ్ సెంటర్‌లో పలువురు మహిళలకు ఆదివారం సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ప్రవేశించి తమ సత్తా చాటుతున్నారన్నారు. కార్యక్రమంలో విజన్ లైఫ్ సెంటర్ అధ్యక్షుడు సాల్మన్ కొల్లాబత్తుల, పాస్టర్లు పాల్గొన్నారు.

గంగానమ్మకు ప్రత్యేక పూజలు



పామర్రు: స్థానిక గంగానమ్మ తల్లి ఆలయంలో ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా ఆదివారం రాత్రి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి నూతన వస్త్రాలను సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. కృష్ణా జిల్లా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ వల్లూరిపల్లి గణేష్, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్యశిబిరం

తోట్లవల్లూరు: మండలంలోని వల్లూరుపాలెంలో హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో సెంటినీ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ పాఠశాల్లో ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఎమ్మెల్యే కుమార్‌రాజా ప్రారంభించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ గత పదిహేనేళ్లుగా చేస్తున్న సేవలను కొనియాడారు. ప్రముఖ గుండె వైద్యుడు డాక్టర్ కాగిత కృష్ణచంద్ ఆధ్వర్యంలో డాక్టర్ల బృందం 150 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, మందులను అందజేశారు. హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు చింతపల్లి వెంకటేశ్వరరావు, అధ్యక్షుడు బడుగు శ్రీకాంత్, కార్యదర్శి మక్కిన సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన గంగానమ్మ జాతర

వేలాదిగా తరలి వచ్చిన భక్తులు

పామర్రు: ఆరు రోజులుగా నిర్వహించిన గంగానమ్మ జాతర సంబరాలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి తమ మొక్కులను తీర్చుకున్నారు. గ్రామస్తులు తమ పశువులను, వాహనాలను, ఎడ్ల బండ్లను, ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు గండ దీపాలను తల మీద పెట్టుకుని మేళ తాళాలతో ఊరేగింపుగా తమ ఇళ్ల వద్ద నుంచి ఆలయానికి చేరుకుని తమ మొక్కులను తీర్చుకున్నారు. భక్తులు తమకు తోచిన విరాళాలను అమ్మవారి జాతర సంబరాల నిర్వహణ కమిటీ సభ్యులకు అందజేసి సహకరించారు. తొలుత ఆలయం నుంచి అమ్మవారిని మేళ తాళాలతో ఊరేగింపుగా గ్రామ పొలిమేర వద్దకు చేరుకుని తొలి రోజున కట్టిన రక్షలను తొలగించేశారు. అనంతరం అమ్మవారిని ఆలయానికి తీసుకొచ్చారు. భక్తులకు అసౌకర్యాలు కలుగకండా కమిటీ సభ్యులు తగు చర్యలు తీసుకున్నారు.



దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

ఉచిత ప్రసాద వితరణ

ఆలయానికి వచ్చిన భక్తులకు స్థానిక ఆర్యవైశ్య సంఘ సభ్యుల ఆధ్వర్యంలో ప్రసాదాన్ని ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

భక్తులకు పులిహోర ప్రసాదం

అయ్యప్ప స్వామి కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఆలయం వద్ద భక్తులకు పులిహోర ప్రసాద పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.



అమ్మవారి ఆలయం వద్ద జన సందోహం

10వేల వాటర్ ప్యాకెట్ల పంపిణీ

భక్తులు బొండా నాగేశ్వరరావు, కొనసాని శివశంకరరావు వితరణతో జాతరకు వచ్చిన భక్తులకు 10 వేల వాటర్ ప్యాకెట్‌లు, మజ్జిగను అందజేశారు. ఆలయ కమిటీ ఆలయ కమిటీ అధ్యక్షుడు బొమ్మారెడ్డి వెంకటరామిరెడ్డి, సభ్యులు నందిపాటి బాలసుబ్రమణ్యేశ్వరరెడ్డి, బాల వెంకటేశ్వరెడ్డి, రాజేష్‌రెడ్డి, గుజవర్తి చంద్రశేఖర్‌రెడ్డి, అంజిరెడ్డి, భీమవరపు శ్రీనివాసరెడ్డి, సరిపల్లి రాజశేఖర్‌రెడ్డి, మున్నంగి వెంకటరెడ్డి, దేవిరెడ్డి బాల వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత భావనను అలవర్చుకోవాలి

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికారి ప్రతినిధి కైలే అనిల్‌కుమార్



గంగానమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న కైలే అనిల్‌కుమార్

పామర్రు: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావనను అలవర్చుకోవాలని అప్పుడే సమాజం సస్యశ్యామలంగా ఉంటుందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికారి ప్రతినిధి కైలే అనిల్ కుమార్ అన్నారు. పామర్రు గంగానమ్మ తల్లి జాతర మహోత్సవాలు ముగింపు సందర్భంగా ఆలయంలో ఆదివారం రాత్రి ప్రత్యేక పూజలను చేశారు. ఆలయంలో ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించారు. అనిల్‌కుమార్ మాట్లాడుతూ అందరూ కలిసి జాతర మహోత్సవాన్ని విజయవంతం చేయడం ఎంతో అభినందనీయమన్నారు. హిందూ ధర్మ పరిరక్షణకు ఇటువంటి జాతర మహోత్సవాలు ఉపయుక్తం అవుతాయన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అనిల్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు ఆరేపల్లి శ్రీనివాసరావు, ఆరుమళ్ల రమాదేవి, ఎంపీటీసీ సభ్యులు తాడిశెట్టి శ్రీనివాసరావు, పీ రత్నకుమారి, జమీగొల్వేపల్లి గ్రామ సర్పంచ్ ఆర్.శాంత కుమారి, ఉప సర్పంచ్ దేవిరెడ్డి బాల వెంకటేశ్వరరెడ్డి, మండల కో-ఆప్షన్ సభ్యులు ఎండీ హస్మతుల్లా, నాయకులు ఎస్. సురేష్ రెడ్డి, ఎం వెంకటరెడ్డి, మర్రెడ్డి అంజిరెడ్డి, శివారెడ్డి, పీ సందీప్, ఎస్. సాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కొల్లేరు ఇలవేల్పు పెద్దింట్లమ్మ తల్లి

నేడు జలదుర్గ గోకర్ణేశ్వరస్వామి కల్యాణోత్సవం

కైకలూరు: కొల్లేటి పెద్దింట్లమ్మ జాతర కొల్లేరు సరస్సు మధ్యన అంగరంగ వైభవంగా జరుగుతోంది. అత్యంత పురాతన చరిత్ర కలిగిన ఆలయాల్లో కైకలూరు మండలం కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానం ఒకటి. ఏటా ఫాల్గుణ శుద్ధ పాడ్యమి నుంచి పౌర్ణమి వరకూ జాతర జరుగుతుంది. ఈ ఏడాది ఈ నెల 1 నుంచి 13 వరకు అమ్మవారి జాతర(తీర్థం) నిర్వహిస్తున్నారు. జాతరలో కీలకఘట్టమైన జలదుర్గా గోకర్ణేశ్వరుల కల్యాణం సోమవారం జరగనుంది.

తొమ్మిది అడుగుల ఎత్తులో..

కొల్లేరు సరస్సు మధ్యలో కోట దిబ్బపై పెద్దింట్లమ్మతల్లి తొమ్మిది అడుగుల ఎత్తులో, విశాల నేత్రాలతో భక్తులకు దర్శనమిస్తారు. పిఠాపురం శాసనం బట్టి అగస్త్యుడు కొల్లేటికోట చుట్టూ 160 రాజ హస్తాల వెడల్పు, 40 రాజ హస్తాల ఎత్తు, ఏడు నిలువుల లోతు, మూడు కోశాల చుట్టుకొలత కలిగిన పెద్ద అగడ్త ఉండేదని చెబుతారు. కాలాలతో పాటు కోటలు మాయమైనా పెద్దింట్లమ్మ తల్లి విగ్రహం చెక్కుచెదరకుండా ఉండటం విశేషం. పెద్దింట్లమ్మ ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలో 44 కొల్లేరు దిబ్బలపై నివసించే వారందరికీ కులదైవం.



కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానం



కొల్లేటికోట పెద్దింట్లమ్మ తల్లి

గ్రంథాల్లో కొల్లేరు అందాలు..

రామాయణ అరణ్యకాండంలో అగస్త్య మహాముని శ్రీరాముడికి ఈ సరస్సు గురించి చెప్పినట్లు ఉంది. దండి అనే మహాకవి తన దశకుమార చరిత్రలో కొల్లేరు సరస్సును అభివర్ణించాడు. క్రీ.శ. 7వ శతాబ్దంలో చైనా బౌద్ధ యాత్రికుడు హ్యుయాన్ త్సాంగ్ వేంగి, కొల్లేరు ప్రాంతాల్లో పర్యటించాడు. అనంతరం తన గ్రంథంలో కొల్లేరు సరస్సు ప్రాముఖ్యత వివరించాడు.

చరిత్రలో కొల్లేరు

11వ శతాబ్దం నుంచి వేంగి - చాళుక్య రాజులు పెద్దింట్లమ్మను కొలుస్తున్నారని కమలాకరపురం వల్లభుని 12, 13వ శతాబ్దపు శాసనాల వల్ల తెలుస్తోంది. వీరు కమలాకరపురం(నేటి ఏలూరు), పద్మినిపురం(నేటి గణపవరం), కొలనువీడు(నేటి కొల్లేటికోట) త్రిపురాలుగా చేసుకుని పాలించారు. 985లో వెలువడిన రూల్ ఆఫ్ ద చాళుక్య - చోళ పుస్తకంలో వేంగి చాళుక్యుల కాలంలో కొల్లేరుకు కొలను విషయ, సాగర విషయగా పేర్లు ఉన్నట్లు రాయబడింది.



గోకర్ణేశ్వరపురంలో గోకర్ణస్వామి

కొండలమ్మకు మొక్కుల చెల్లింపు

గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారి సన్నిధిలో భక్తులు తమ మొక్కులను చెల్లించుకున్నారు. ఆదివారం అధిక సంఖ్యలో భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఈఓ ఆకుల కొండలరావు ఏర్పాట్లు చేశారు.

అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం

గుడ్లవల్లేరు: రెడ్డిపాలెం అభయాంజనేయ స్వామి ఆలయ 37వ వార్షికోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ ఆకుల కొండలరావు ఆధ్వర్యంలో ఆదివారం స్వామికి స్నపన కార్యక్రమం నిర్వహించారు.

నేడు గంగానమ్మ ఆలయానికి శంకుస్థాపన

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరులో శ్రీ గంగానమ్మ తల్లి ఆలయానికి శంకుస్థాపన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నామని ఎస్ఈఆర్ఎమ్ విద్యా సంస్థల చైర్మన్ వల్లభనేని వెంకట్రావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కొసరాజు బాపయ్య చౌదరి ఆదివారం తెలిపారు.

వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల బ్రోచర్ల ఆవిష్కరణ

గుడివాడ టౌన్: స్థానిక కాకర్లవీధి గీతాభవనం రోడ్డులోని శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరగాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కోరారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు జరిగే ఈ బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. ఆలయ ఏఓ కె. గోపాలరావు పాల్గొన్నారు.



బ్రోచర్లను ఆవిష్కరించిన ఎమ్మెల్యే రాము